GHMC hmda Growing Global TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers, Opp: GHMC Circle Office, Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
గురువారం 1-10-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్




క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి: సిరిసిల్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే భారీ బహిరంగ సభకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చేలా ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో రవాణా, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అయితే మరోవైపు సభకు బస్సులను వినియోగించడం వల్ల సాధారణ ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రజల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. ప్రతిరోజూ తమ పనులు, విద్య, వైద్యం, వ్యాపారం, ఉద్యోగాల కోసం ఆర్టీసీ బస్సులపై ఆధారపడే సామాన్య ప్రజలకు రవాణా సౌకర్యం తగ్గితే వారి పరిస్థితి ఏమిటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

4లో

# సూక్ష్మ సేద్యంతో పంట దిగుబడి, రైతుల ఆదాయం పెంపు

**డ్రిప్ ఇరిగేషన్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి**

**నాబార్డ్ జిల్లా అధికారి కృష్ణ తేజ**

2లో



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 30:** సూక్ష్మ నీటి సేద్యం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు పంటల దిగుబడి, రైతుల ఆదాయాన్ని పెంచుకోవచ్చని నాబార్డ్ జిల్లా అధికారి కృష్ణ తేజ అన్నారు. రైతులు డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. బుధవారం కృష్ణ తేజ, జిల్లా ఉద్యానశాఖ అధికారి సోమేశ్వర్‌రావుతో కలిసి చౌటకూరు, కంది, సంగారెడ్డి, సదాశివపేట మండలాల్లో పర్యటించారు. నాబార్డ్ సహకారంతో ఉద్యానశాఖ అమలు చేస్తున్న తెలంగాణ సూక్ష్మ నీటి సేద్య పథకం కింద లబ్ధి పొందిన రైతుల ఆయిల్‌పామ్, చెరుకు తదితర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా తోటల్లో ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థల పనితీరును పరిశీలించి రైతులతో మాట్లాడారు. నీటి వినియోగం, పంట దిగుబడి, సాగు ఖర్చులు, రైతులకు కలుగుతున్న ప్రయోజనాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పంటలకు అవసరమైన నీటిని సమర్థవంతంగా అందించడం వల్ల 20 నుంచి 30 శాతం వరకు అదనపు దిగుబడి వస్తోందని రైతులు తెలిపారు. కూలీల ఖర్చు, సాగు వ్యయం తగ్గడంతో పాటు నికర

మిగతా 2లో

# బాలానగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ శేషాద్రిణి రెడ్డి

**బాలానగర్, సెప్టెంబర్ 30 (క్రైమ్ మిర్రర్) :** సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం ఐపీఎస్, డీసీపీ--2 ఎస్. శేషాద్రిణి రెడ్డి, బుధవారం బాలానగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, అక్కడి నిర్వహణ తీరును సమీక్షించారు. అనంతరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి, వారి విధులు, బాధ్యతలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ నియంత్రణలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను స్పష్టంగా తెలుసుకుని, సమన్వయంతో విధులు నిర్వహించాలని ఈ సందర్భంగా డీసీపీ సూచించారు. నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడటం, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంలో ట్రాఫిక్ పోలీసుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అలాగే పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులను పరిశీలించి, విధుల నిర్వహణ, రికార్డుల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, ట్రాఫిక్ నియంత్రణలో క్రమశిక్షణ, సమయపాలన, సమన్వయానికి ప్రాధాన్యత ఇవ్వాలని డీసీపీ శేషాద్రిణి రెడ్డి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.



# ఎఐ, బయోమెడికల్ ఆవిష్కరణలపై సంయుక్త పరిశోధనకు కీలక చర్చలు

**సాంకేతికత--వైద్య రంగాల సమన్వయంతో ఆరోగ్య సేవల మెరుగుదలకు కార్యాచరణ**



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 30:** కృత్రిమ మేధస్సు, బయోమెడికల్ ఆవిష్కరణలు, డిజిటల్ హెల్త్ తదితర రంగాల్లో సంయుక్త పరిశోధన, సాంకేతిక అభివృద్ధిపై ఐఐటీ హైదరాబాద్, ఎయిమ్స్ బిబినగర్ నిపుణులు చర్చించారు. భారతదేశ ఆరోగ్య సంరక్షణ సవాళ్లకు సాంకేతిక, వైద్య నైపుణ్యాలను సమన్వయం చేసి ఆచరణాత్మక పరిష్కారాలు అభివృద్ధి చేయడంపై సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించారు. ఐఐటీ హైదరాబాద్ విభాగాధిపతులు, అధ్యాపకులు, ఎయిమ్స్ బిబినగర్ నిపుణులు పాల్గొన్న ఈ సమావేశంలో వైద్యం, ఇంజినీరింగ్, ఎఐ, బయోమెడికల్ సైన్సెస్, డిజిటల్ హెల్త్‌కేర్ అంశాలపై చర్చించారు. ఎఐ ఆధారిత ఆరోగ్య సేవలు, టెలిమెడిసిన్, వైద్య పరికరాలు, అధునాతన ఇంప్లాంట్లు, వ్యాధులపై పరిశోధన, ఆరోగ్య సేవలను విస్తరించే సాంకేతికతలను సంయుక్తంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను మెరుగుపరిచేందుకు ములుగు సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీతో కలిసి చేపట్టే కార్యక్రమాలపైనా చర్చించారు. ప్రయోగశాలల్లో అభివృద్ధి చేసే సాంకేతికతను వైద్య సేవల్లోకి తీసుకువచ్చి ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విధంగా సంయుక్త ప్రాజెక్టులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ చర్చలు ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి, ఎయిమ్స్ బిబినగర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అమితా అగర్వాల్ నాయకత్వంలో కొనసాగుతున్నాయి. ఐఐటీ హైదరాబాద్ తరపున ప్రొఫెసర్ జి. నరహరి శాస్త్రి, ఎయిమ్స్ బిబినగర్ తరపున రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ రాహుల్ నారంగ్ సమన్వయం చేశారు. ఐఐటీ హైదరాబాద్--ఎయిమ్స్ బిబినగర్ మధ్య సంస్థాగత స్థాయిలో విస్తృత సహకారాన్ని పెంచడంతో పాటు పరిశోధన ఫలితాలను ఆరోగ్య సంరక్షణ అనువర్తనాలుగా మార్చేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రయోగశాల స్థాయి పరిశోధనను రోగుల చికిత్సకు ఉపయోగపడే ఆచరణాత్మక వైద్య పరిష్కారాలుగా మార్చడమే లక్ష్యమని ఎయిమ్స్ బిబినగర్ ఆర్థోపెడిక్స్ విభాగం ప్రొఫెసర్ డా. మహేశ్వర్ లక్కిరెడ్డి తెలిపారు.

# సూక్ష్మ సేద్యంతో పంట దిగుబడి, రైతుల ఆదాయం పెంపు





ఆదాయం పెరుగుతోందని పేర్కొన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి సోమేశ్వర్‌రావు మాట్లాడుతూ తక్కువ నీటితో పంటలకు అవసరమైన తేమను అందించేందుకు సూక్ష్మ నీటి సేద్యం ఎంతో ఉపయోగకరమన్నారు. ఆయిల్‌పామ్, చెరుకు వంటి పంటల్లో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటి పొదుపుతో పాటు ఉత్పాదకత, రైతుల ఆదాయం పెంచుకోవచ్చని తెలిపారు. అర్హులైన రైతులు ప్రభుత్వం అందిస్తున్న సూక్ష్మ నీటి సేద్య పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు సమత, అనూషరెడ్డి, సునీత, డ్రిప్ ఇంజినీర్ ఉమతో పాటు ఫినోలెక్స్, కుమార్ డ్రిప్ కంపెనీల ప్రతినిధులు మహేష్, రాహుల్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# ఇస్నాపూర్‌లో కండరాల క్షీణతపై అవగాహన

**జన్యు లోపాలను ముందుగానే గుర్తిస్తే వ్యాధి నివారణకు అవకాశం**

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 30:** కండరాల క్షీణత వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఇస్నాపూర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామాలయం ఆవరణలో కండరాల క్షీణత వ్యాధి బాధితుల సంఘం ఆధ్వర్యంలో, సహారా ఇన్‌క్లూజివ్ హాస్పిటల్ సంగారెడ్డి వారి సహకారంతో బుధవారం కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇస్నాపూర్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మోటె సుమలత శ్రీకాంత్ మాట్లాడుతూ కండరాల క్షీణత వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మస్కులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడపతి రవికుమార్ మాట్లాడుతూ.. జన్యుపరమైన కారణాలతో వచ్చే కండరాల క్షీణతపై ముందుగానే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గర్భధారణ సమయంలో వైద్యుల సూచన మేరకు జన్యుపరమైన పరీక్షలు చేయించుకోవడం ద్వారా పుట్టబోయే శిశువుకు సంబంధించిన ఆరోగ్య పరిస్థితులను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు. జన్యుపరమైన వ్యాధులపై అవగాహన పెంచుకుని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా 15 మంది కండరాల క్షీణత బాధితులకు బాదం, జీడిపప్పు, కిస్మిస్‌తో కూడిన ఆరోగ్య కిట్లను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బూరిగారి నరేందర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు బండ రాజు, యువచైతన్య దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు కంటిగారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్య పోటీల్లో ప్రపంచ వేదికపై మెరిసిన బాలానగర్ బిడ్డ

**బాలానగర్, సెప్టెంబర్ 30 (క్రైమ్ మిర్రర్) :** ప్రపంచ నైపుణ్య పోటీల్లో భారత్ తరపున పాల్గొని వెండి పతకం సాధించి దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి, బాలానగర్ ప్రాంతానికి గర్వకారణంగా నిలిచిన మెహరున్నిసా బేగంను బాలానగర్ ప్రాంత నాయకులు, మేధావులు ఘనంగా సన్మానించారు. ప్రపంచస్థాయిలో ప్రతిభ చాటుకుని అంతర్జాతీయ వేదికపై భారత కీర్తిపతాకాన్ని రెపరెపలాడించిన ఆమె విజయాన్ని అభినందిస్తూ పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్‌కు చెందిన మహమ్మద్ జావిద్ కుమార్తె మెహరున్నిసా బేగం, సెప్టెంబర్ 22 నుంచి 27 వరకు చైనాలోని షాంఘైలో నిర్వహించిన 48వ ప్రపంచ నైపుణ్య పోటీలు (వరల్డ్‌స్కిల్స్ షాంఘై--2026)లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి లాజిస్టిక్స్ అండ్ ఫ్రైట్ ఫార్వర్డింగ్ విభాగంలో వెండి పతకం సాధించారు. సుమారు 70 దేశాలు, ప్రాంతాలకు చెందిన 1,400 మంది యువ నైపుణ్య పోటీదారులు 64 విభాగాల్లో పాల్గొన్న ఈ అంతర్జాతీయ పోటీల్లో ఆమె అసాధారణ ప్రతిభ కనబరిచి పతకాన్ని కైవసం చేసుకోవడం విశేషం. ఆయా విభాగాల్లో ప్రతిభ చాటిన మెహరున్నిసా బేగం ప్రపంచస్థాయిలో పతకం సాధించడం పట్ల బాలానగర్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేదరికం, ఆర్థిక ఇబ్బందులు ప్రతిభకు, విజయాలకు అడ్డంకులు కావని మెహరున్నిసా బేగం తన విజయంతో నిరూపించారని కొనియాడారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చి అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించడం ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. బేకరీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న ఆమె తండ్రి మహమ్మద్ జావిద్, తన కుమార్తె ప్రతిభను ప్రోత్సహించి దేశం గర్వించే స్థాయికి తీసుకెళ్లడం అభినందనీయమని ప్రశంసించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, పట్టుదల, కృషి ఉంటే యువతులు ప్రపంచస్థాయిలోనూ రాణించగలరని ఆమె విజయం చాటిచెప్పిందన్నారు. మెహరున్నిసా బేగం భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశానికి మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని బాలానగర్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని బాలికలు, యువతులు తమలోని నైపుణ్యాలను గుర్తించి వివిధ రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ప్రతిభావంతులైన పేద యువతకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు మరింత ప్రోత్సాహం అందించాలని కోరారు. ఈ సన్మాన కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఎల్.ఎస్.రావు, సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఐలాపురం రాజశేఖర్, ఎంబిఎం నాయకుడు మహంకాళి శంకర్, కాంగ్రెస్ పార్టీ బాలానగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు మధు గౌడ్, సమంత్ గౌడ్, అక్రం, గోవర్ధన్ రెడ్డి, దివాకర్ తదితరులు పాల్గొని మెహరున్నిసా బేగంకు అభినందనలు తెలిపారు.



# అమీన్పూర్ ప్రజా సమస్యలపై ఎమ్మెల్సీ అంజిరెడ్డికి ఈర్ల రాజు వినతి

**పెండింగ్ పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించిన ఎమ్మెల్సీ**



**అమీన్పూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 30:** అమీన్పూర్ మండలంలోని వివిధ గ్రామాలు, కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని మెదక్--నిజామాబాద్--ఆదిలాబాద్--కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి తెలిపారు. అమీన్పూర్ బీజేపీ మండల అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్ బుధవారం వారిని మర్యాదపూర్వకంగా కలిసి మండలంలోని ప్రజా సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. పటేల్‌గూడ, కిష్టారెడ్డిపేట్‌తో పాటు పలు గ్రామాలు, కాలనీలలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలు, పెండింగ్ అభివృద్ధి పనులను ఈర్ల రాజు వివరించారు. స్పందించిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే కొన్ని పనులు ప్రారంభించామని, మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని అధికారులు తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయి వరకు విస్తరించాలని, ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ.. అమీన్పూర్ మండలంలోని ప్రతి గ్రామం, కాలనీలో ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# హక్కులపై అవగాహనతోనే ప్రజల్లో చైతన్యం..!!

**సెగ్గంపల్లిలో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం**

**ప్రజలకు పౌర హక్కులపై అవగాహన కల్పించిన అధికారులు**

**భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులను సంప్రదించాలి**




**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** తమకు కల్పించిన హక్కులు ఏమిటో తెలుసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, హక్కులపై అవగాహన ఉన్నప్పుడే వాటిని సమర్థవంతంగా వినియోగించుకోగలమని వక్తలు పేర్కొన్నారు. పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం భూపాలపల్లి మండలం సెగ్గంపల్లి గ్రామంలో పౌర హక్కులపై అవగాహన సమావేశం నిర్వహించారు. భూపాలపల్లి తహశీల్దార్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి 1వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ శ్రీమతి బౌతు శోభ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బౌతు శోభ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన హక్కులపై ప్రజలు పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. తమ హక్కులకు ఎలాంటి భంగం కలిగినా సంబంధిత అధికారులను ఆశ్రయించి, చట్టపరమైన మార్గాల్లో సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. హక్కులను తెలుసుకోవడంతో పాటు వాటిని బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో పాల్గొన్న గిర్దవార్ రామస్వామి పౌరులు తమ హక్కులను ఎలా వినియోగించుకోవాలో వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొనే భూ సమస్యలపై స్పందిస్తూ, భూములకు సంబంధించిన సమస్యలు తలెత్తినప్పుడు సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించి నిబంధనల ప్రకారం పరిష్కరించుకోవాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించాలని, విద్య వ్యక్తిగత అభివృద్ధితో పాటు సామాజిక పురోగతికి దోహదపడుతుందని రామస్వామి తెలిపారు. విద్య ద్వారా జ్ఞానం, చైతన్యం పెంపొందించుకుని సమాజంలో ఉన్నత స్థానాలను సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంచుకోవడంతో పాటు ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సమావేశంలో సూచించారు. ఈ కార్యక్రమంలో జీపీఓ బండి శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది వరుణ్, తరుణ్ తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆవిష్కరణలకు ఊతం..

**బీవీఆర్ఐటీలో ఐఈఈఈ కమ్యూనికేషన్స్ సొసైటీ స్టూడెంట్ బ్రాంచ్ ప్రారంభం**




**నర్సాపూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 30:** నరసాపూర్‌లోని బి.వి. రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో ఐఈఈఈ కమ్యూనికేషన్స్ సొసైటీ స్టూడెంట్ బ్రాంచ్ చాప్టర్‌ను బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. బీవీఆర్ఐటీలోని ఈఎల్ఎన్ సెమినార్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు కమ్యూనికేషన్ టెక్నాలజీలు, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఇంటెలిజెంట్ హార్డ్‌వేర్ రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేందుకు, పరిశోధన, ఆవిష్కరణలు, వృత్తిపరమైన నెట్‌వర్కింగ్‌కు అవకాశాలు కల్పించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఐఈఈఈ హైదరాబాద్ సెక్షన్ కార్యదర్శి, సిలికాన్ ల్యాబ్స్ ఇంజనీరింగ్ సీనియర్ డైరెక్టర్ ఎన్. వెంకటేష్, ఐఈఈఈ హైదరాబాద్ సెక్షన్ స్టూడెంట్ యాక్టివిటీ కమిటీ చైర్ డా. వై. పద్మ సాయి, ఐఈఈఈ హైదరాబాద్ సెక్షన్ కమ్యూనికేషన్స్ సొసైటీ చాప్టర్ కార్యదర్శి డా. విశ్వనాథం రావురి తదితరులు హాజరయ్యారు. బీవీఆర్ఐటీ డైరెక్టర్ డా. కె. లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డా. సంజయ్ దుబే, మేనేజర్ బాపి రాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్ కార్యక్రమానికి మద్దతు అందించారు. ఈసీఈ విభాగం ప్రొఫెసర్, హెచ్ఓడీ డా. సంజీవ రెడ్డి, ప్రొఫెసర్ డా. ఎం.సి. చిన్నయ్య, ఐఈఈఈ కామ్‌సాక్ స్టూడెంట్ బ్రాంచ్ చాప్టర్ ఫ్యాకల్టీ అడ్వైజర్ డా. కాలతిరిపి రాంబాబు, ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ కౌన్సిలర్ డా. బి. నరేష్ కుమార్, ఐఈఈఈ కోఆర్డినేటర్లు ఎం. అనూష, టి.పి. కౌసల్య నందన్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి అండగా వేనేపల్లి గణేష్‌రావు

**రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేత**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని వంగూరు మండల కేంద్రానికి చెందిన సల్వాది గెల్వయ్య (70) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు వేనేపల్లి గణేష్‌రావు, మాజీ సర్పంచ్ అక్కి లావణ్య ఎల్లాగౌడ్, గ్రామ ఉపసర్పంచ్ బండపల్లి భాస్కర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేసి, గెల్వయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని వారు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు బండపల్లి జంగయ్య, వార్డు సభ్యులు సుమన్, అక్కి మురళీ, నారమోని జంగయ్య, బండపల్లి శివకుమార్, లట్టుపల్లి మురళి, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఎల్లికంటి మురళి, బాషమోని కృష్ణ, అయినాల రమేష్, జంపుల మధు, లక్ష్మణ్, రమేష్, బండపల్లి శ్రీశైలం, బుచ్చిరాములు, భాషమోని వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సంక్షేమమే ధ్యేయం: మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల

**ఘనంగా 'సఫాయి మిత్ర సురక్ష ఏవం సమ్మాన్ శివిర్' వైద్య శిబిరం**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** ప్రజారోగ్య పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న మున్సిపల్, పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం, సంక్షేమం కోసం 'సఫాయి మిత్ర సురక్ష ఏవం సమ్మాన్ శివిర్' కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికుల సేవలను అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. వైద్య శిబిరంలో కార్మికులకు బీపీ, షుగర్ తదితర ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అనారోగ్య సమస్యలు ఉన్న వారికి వైద్యుల సూచనలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. విధి నిర్వహణలో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, వృత్తిపరమైన ప్రమాదాల నుంచి రక్షణ పొందే మార్గాలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ భీమ మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులు ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమిస్తున్నారని, అదే సమయంలో తమ ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య, సంక్షేమ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనందకుమార్ మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికుల సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలను మున్సిపాలిటీ పరిధిలో నిరంతరం నిర్వహిస్తామని, కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ షేక్, సీహెచ్ఓ శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ వర్షిత్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు భాగ్యలక్ష్మి, నాగలక్ష్మి, ఆశా కార్యకర్తలు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సీఎం మీటింగ్ ఎఫెక్ట్ సామాన్యులకు 'సవారీ కష్టాలు'



### ప్రజల అవసరాల కంటే సభ ముఖ్యమా?

ముఖ్యమంత్రి పర్యటన ఒక ప్రభుత్వ కార్యక్రమం. అందుకు అవసరమైన భద్రతా, రవాణా ఏర్పాట్లు చేయడం అధికారుల బాధ్యతే. అయితే అదే సమయంలో సాధారణ ప్రజల ప్రయాణ అవసరాలను కూడా ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులు పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఒక బస్సు కోసం విద్యార్థి గంటల తరబడి వేచి చూడాల్సి వస్తే, ఆసుపత్రికి వెళ్లాల్సిన రోగి ప్రయాణ సౌకర్యం కోసం ఇబ్బంది పడాల్సి వస్తే, పనికి వెళ్లే కూలీ లేదా ఉద్యోగి సమయానికి చేరుకోలేకపోతే ఆ నష్టాన్ని ఎవరు భరిస్తారు? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

### పల్లెల ప్రజల పరిస్థితి మరింత ఇబ్బందికరం

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా రవాణా ప్రధానంగా ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులు అందుబాటులో లేకపోతే విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంటుంది. బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తే అదనపు చార్జీలు చెల్లించాల్సి వస్తుందని ప్రయాణికులు చెబుతున్నారు. ప్రజా రవాణా అందుబాటులో ఉండటం తమ హక్కు కాకపోయినా, కనీస ప్రయాణ సౌకర్యం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని వారు అభిప్రాయపడుతున్నారు.

### ప్రజల రాకపోకలకు ప్రత్యామ్నాయం ఏది?

సభకు ప్రజలను తరలించేందుకు రవాణా ఏర్పాట్లు చేయడంపై అభ్యంతరం లేదని, కానీ సభకు వెళ్లని సామాన్య ప్రజల ప్రయాణాన్ని ఎందుకు ఇబ్బందుల్లోకి నెట్టాలని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వం ప్రజల సంక్షేమం, ప్రజా పాలన గురించి మాట్లాడుతుంటే మరోవైపు ప్రజల నిత్య ప్రయాణాలకు అవసరమైన బస్సులు అందుబాటులో లేకపోవడం సమంజసం కాదని స్థానికులు అంటున్నారు. సభకు అవసరమైన బస్సులను వినియోగించాల్సి వస్తే ముందుగానే ప్రత్యామ్నాయ బస్సులు ఏర్పాటు చేయాలని, కీలకమైన రూట్లలో సాధారణ సర్వీసులు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### అధికారులు వెంటనే స్పందించాలి

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఏఏ రూట్ల నుంచి ఎన్ని బస్సులు మళ్లించారో, ఆ రూట్లలో సాధారణ ప్రయాణికుల కోసం ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారో అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. సీఎం సభకు వచ్చే ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించడం ఎంత ముఖ్యమో.. సభకు రాని లక్షలాది సామాన్య ప్రజల నిత్య ప్రయాణాలను సజావుగా కొనసాగించడం కూడా అంతే ముఖ్యం. ప్రజల కోసం నిర్వహించే కార్యక్రమం కారణంగా ప్రజలే ఇబ్బందులు పడే పరిస్థితి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### ప్రజల ప్రశ్న ఒక్కటే...

సభ ఒక రోజు.. కానీ మా ప్రయాణ అవసరాలు ప్రతిరోజూ. మా బస్సులు ఎందుకు ఆపాలి? మా ఇబ్బందులకు పరిష్కారం ఎవరు చూపిస్తారు? ప్రజల ప్రయాణ హక్కును దృష్టిలో పెట్టుకుని అదనపు బస్సులు ఏర్పాటు చేసి, సాధారణ సర్వీసులను యథావిధిగా కొనసాగించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

## నిరుపేద కుటుంబానికి సొంతింటి నిర్మాణంలో సర్పంచ్ అండ

**సిమెంట్ అందజేసిన కాసు శ్రీనివాస్ రెడ్డి**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి తలకొండపల్లి):** తలకొండపల్లి మండలంలోని లింగరావుపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం ఇంటి నిర్మాణం ఆర్థిక ఇబ్బందులతో మధ్యలో నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న లింగరావుపల్లి గ్రామ సర్పంచ్, తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి స్పందించి కుటుంబాన్ని పరామర్శించారు. ఇంటి నిర్మాణం కొనసాగించేందుకు అవసరమైన సిమెంట్‌ను అందజేసి కుటుంబానికి అండగా నిలిచారు. ఆపద సమయంలో సహాయం అందించిన సర్పంచ్‌కు రాజమౌని శేఖర్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న కాసు శ్రీనివాస్ రెడ్డి సేవలను



గ్రామస్థులు అభినందించారు.

## అనుమానాస్పద స్థితిలో బైక్ మెకానిక్ శ్రీను మృతి



**చండూరు, క్రైమ్ మిర్రర్:** నల్గొండ జిల్లా చండూరు మండలం ఉడుతలపల్లి గ్రామ శివారులో ఓ వ్యక్తి మృతదేహం అనుమానాస్పద స్థితిలో కనిపించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. బుధవారం ఉదయం రోడ్డు పక్కన గడ్డి పొదల్లో మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న చండూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని కనగల్ మండలం పోనుగోడు గ్రామానికి చెందిన బండమీది శ్రీను (35)గా గుర్తించారు. శ్రీను కురంపల్లి గ్రామంలో బైక్ మెకానిక్ షాప్ నిర్వహిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

### ప్రమాదమా? హత్యా?

మంగళవారం రాత్రి ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయితే మృతదేహం లభించిన తీరు, పరిసరాల్లో ఉన్న ఆనవాళ్లను బట్టి పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. మృతదేహం లభించిన ప్రదేశంతో పాటు పరిసర ప్రాంతాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. మృతుడి మరణానికి గల పూర్తి కారణాలు పోస్టుమార్టం నివేదిక, పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

## కల్వకుర్తికి తలమానికంగా అంబేద్కర్ కాంస్య విగ్రహం

**రూ.50 లక్షల ఎమ్మెల్యే నిధులతో ఏర్పాటు.. అక్టోబర్ 2న భూమిపూజ**

**మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని కల్వకుర్తి పట్టణంలో ఘనంగా ఏర్పాటు చేయనున్నట్లు మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి నిధుల నుంచి రూ. 50 లక్షల వ్యయంతో విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 2న విగ్రహ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పట్టణంలోని టీఎస్‌యూటీఎఫ్ భవన్‌లో బుధవారం అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బృంగి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు, ఆలోచనా విధానాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన హక్కులు, సామాజిక న్యాయం అందించేందుకు అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. కల్వకుర్తి పట్టణంలో అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం ప్రజలకు గర్వకారణంగా నిలుస్తుందని పేర్కొన్నారు. విగ్రహ ఏర్పాటుకు సహకరిస్తున్న ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అంబేద్కర్ విగ్రహం కల్వకుర్తి పట్టణానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా నిర్మాణాన్ని చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మబ్బు సాయన్న మాదిగ, వీరస్వామి, స్వేరోస్ సీనియర్ నాయకులు దుబ్బ నాగేష్, గోపాల్‌రావు, విశ్రాంత ఉపాధ్యాయులు ఏపీ మల్లయ్య, బీసీ సంఘం నాయకులు రాజేందర్, కౌన్సిలర్ రామకృష్ణ, చిత్తరి శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ గోరేటి శీను, చిన్న, శేఖర్, మల్లేష్, పడకంటి వెంకటేష్, మైనారిటీ నాయకురాలు రేష్మ తదితరులు పాల్గొన్నారు.



# సర్ పై తప్పుడు ఆరోపణలు సరికాదు

**బిజెపి నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్**



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** సర్ పై కాంగ్రెస్ పార్టీ తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని బిజెపి నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అన్నారు. మండల పార్టీ కార్యాలయంలో బుధవారంఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ఓటు దొంగతనంగా చిత్రీకరించటం ప్రజలను తప్పుదోవ పట్టించడమే నన్నారు. ఓటర్ల జాబితాలో ఉన్న లోపాలను గుర్తించడం మరణించిన వారి పేర్లు తొలగించడం అరతలేని నమోదు లను పరిశీలించటం వంటి చర్యలు ఎన్నికల జాబితా ను సరిచేయమేనన్నారు చట్టబద్ధత అర్హత లేని వ్యక్తుల పేర్లు గుర్తించి తొలగించే చర్యలపై కాంగ్రెస్ పార్టీ ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తుందో చెప్పాలని ప్రశ్నించారు ఓటరు జాబితా కచ్చితంగా ఉండాలని కోరడం ప్రతి రాజకీయ పార్టీల బాధ్యత అన్నారు. ఓటమికి కారణాలు వ విశ్లేషించ కుండ ఎన్నికల సంఘం రాజ్యాంగ సంస్థపై ఆరోపణలు చేయటం సరికాదన్నారు కాంగ్రెస్ పార్టీ తమ వైఖరి మార్చు కుని ప్రజాస్వామ్యం సంస్థల పట్ల బాధ్యాతాయతంగ ఉండాలన్నారు ఈ సమావేశంలో మండల మైనార్టీ మోర్చా రాష్ట్ర ఈసీ నెంబర్ షరీఫుద్దీన్ కార్యదర్శులు మల్లబోయిన గోవిందరావు బాజా రామకృష్ణ మండల ఉపాధ్యక్షులు పురాణం దివాకర్ కొండా హర్షవర్ తుపాకుల సంజన సురేపల్లి అనసూయమ్మ మండల కార్యదర్శి ధారావత్ వీరు నాయక్ ఓబీసీ మండల అధ్యక్షుడు పిట్టల సూరిబాబు ఎస్టి మోర్చా మండల కార్యదర్శి మూడు రమేష్ మండల కార్యదర్శి ఏపూరి సత్యనారాయణ బిజెపి మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**-శిల్పారామం లో గుజరాత్ హ్యాండీక్రాఫ్ట్ ఉత్సవ్ కు విశేష స్పందన...**

**కూచిపూడి నృత్యాలతో అలరించిన చిన్నారులు.....**

**క్రైమ్ మిర్రర్ మాదాపూర్ :** శిల్పారామం మాదాపూర్ లో ఇండస్ట్రియల్ ఎక్స్టెన్షన్ కాటేజ్ ఇండెక్స్ (ఐ ఈ సీ ) వారు నిర్వహిస్తున్న గుజరాత్ హ్యాండీక్రాఫ్ట్ ఉత్సవ్ - 2026 సందర్శకులను విశేషంగా ఆకర్శిస్తోంది. ఉత్సవ్ లో భాగంగా లలిత ఫౌండేషన్ ఆఫ్ ఆర్ట్స్ వ్యవస్థాపకురాలు శ్రీమతి లలిత ధనలక్ష్మి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. ఈ సందర్భంగా కళాకారులు వినాయక కౌతం, గణపతి తాళం, బ్రహ్మాంజలి, ముద్దుగారే యశోద, జతిస్వరం, కొలువైతివా రంగా సాయి, నీలమేఘశ్యామ, రామాయణ శబ్దం మొదలైన అంశాలను అద్భుతంగా ప్రదర్శించి మెప్పించారు. కళాకారులూ జయలక్ష్మి, మయూఖి, త్రిపుర, ఐశ్వర్య, యుక్తి, సంజన, దక్షత, ఉర్వి, ఇషా, వైష్ణవి, తేజస్విని, రాధా మానస తదితరులు తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాట్య గురువులు శ్ శ్రీనివాస్ అళ్ళ, శ్రీ వెంకటేశ్వర్లు , చంద్రశేఖర్ , శ్రీమతి సాయి రవళి, శ్రీమతి శృతి రమేష్ విచ్చేసి కళాకారులను అభినందించారు.



# రాంపూర్‌లో విజయవంతంగా గ్రామసభ

**ఉపాధి హామీ పనులు, సామాజిక ఆడిట్‌పై విస్తృత చర్చ**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (తలకొండపల్లి):** తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులు, 15వ విడత సామాజిక ఆడిట్‌తో పాటు గ్రామంలోని పలు అభివృద్ధి, మౌలిక వసతుల సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల పొలాల వద్ద కాంపౌండ్ గుంతలు, ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు తదితర పనులు చేపట్టడం, వాటికి సంబంధించిన నగదు సకాలంలో అందుతున్నదీ లేనిదీ వంటి అంశాలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో తాగునీరు, అండర్‌డ్రైనేజీ, వీధిలైట్లు తదితర సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సర్పంచ్ వట్టెల నిర్మల-శ్రీశైలం యాదవ్ తెలిపారు. 15వ విడత సామాజిక ఆడిట్‌కు సంబంధించిన పలు అంశాలను మండల అధికారులు, డీఆర్‌పీ రమేష్ గ్రామస్థులకు వివరించారు. ఉపాధి హామీ పనుల అమలు, నిధుల వినియోగం, పనుల వివరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సప్పిడి ఆంజనేయులు, కార్యదర్శి రవీందర్, వార్డు సభ్యులు మిద్దెల భార్గవి, సప్పిడి సునీత, దొరిబాయి లాలమ్మ-జంగయ్య, కటికెల మధు యాదవ్, తిక్కల జంగయ్య, కాకి రాము, పబ్బ రమేష్, డీఆర్‌పీ రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు కాకి నరసింహ, తానయ్య, మాజీ ఎంపీటీసీ కటికెల యాదయ్య, రెడ్డి సంఘం అధ్యక్షులు చిన్న హరి మోహన్ రెడ్డి, మాజీ టెంపుల్ చైర్మన్ జానయ్య, మాజీ వార్డు సభ్యులు మీసాల ఆంజనేయులు, ఆర్‌సీజీవీఎస్ చిలకం శేఖర్, డైరెక్టర్ తిక్కల మహేష్, బీఎల్ఓ మద్ది కృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు మజీద్, షర్ఫుద్దీన్, కృష్ణారెడ్డి, పాండు రెడ్డి, యువ నాయకులు రొయ్యల రమేష్, మహేష్, శ్రీశైలం, శశికిరణ్, చింటూ, శివ తదితరులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారులకు అండగా షాపింగ్ కాంప్లెక్స్

**ఎమ్మెల్యే హామీతో కోర్టు కేసుల ఉపసంహరణ.. త్వరలో నిర్మాణ పనులు**




**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (ఆమనగల్లు):** ఆమనగల్లు పట్టణంలోని చిరు వ్యాపారులకు శాశ్వతంగా అండగా నిలిచేలా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం తెలిపారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హామీతో షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించిన కోర్టు కేసులను చిరు వ్యాపారులు ఉపసంహరించుకున్నట్లు పేర్కొన్నారు..బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోర్టు కేసుల కారణంగా పెండింగ్‌లో ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చిరు వ్యాపారులతో సమావేశమై, అందరికీ న్యాయం జరిగేలా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడతామని స్పష్టమైన హామీ ఇచ్చారని చెప్పారు..ఎమ్మెల్యే హామీపై నమ్మకంతో చిరు వ్యాపారులందరూ కలిసి కోర్టు కేసులను ఉపసంహరించుకున్నారని, అతి త్వరలోనే ఎమ్మెల్యే చేతుల మీదుగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని వారు ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆమనగల్లు పట్టణంలో ప్రత్యేక నిధులతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారని తెలిపారు. అభివృద్ధిని ఓర్వలేని ప్రతిపక్షాలు ప్రజలను గందరగోళానికి గురిచేసేలా ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ అనిత శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ మండ్లి రాములు, కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, మార్కెట్ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మాజీ ఎంపీపీ అనిత విజయ్‌నాయక్, ఆదివాసీ రాష్ట్ర కోఆర్డినేటర్ కృష్ణనాయక్, నాయకులు పర్వతాలు, గాజుల శ్రీను, కాలే మల్లయ్య, బాబా, సురేష్, ఎంగలి ప్రసాద్, ఒగ్గు మహేష్, వెంకటేష్‌రెడ్డి, అండెకార్ రాజు, ఆలీం, కొండల్‌రెడ్డి, కుమార్‌గౌడ్, వస్పుల శ్రీకాంత్, ఫరీద్, రాఘవేందర్, శ్రీనునాయక్, ఫిరోజ్, కొప్పు శ్రీశైలం, శివ తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సహాయం

**వెంకట్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** పట్టణంలోని బలరాంనగర్ కాలనీకి చెందిన వెంకట్‌రెడ్డి మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్లు చిత్తరి శ్రీనివాసులు, రమాకాంత్‌రెడ్డిలు మృతుని కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వెంకట్‌రెడ్డి మృతి బాధాకరమని, ఈ కష్ట సమయంలో కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని వారు భరోసా ఇచ్చారు.

# అనాధ ఆశ్రమంలో అన్నదానం

**సామాజిక సేవలో ఆర్టీఐ కార్యకర్త, జర్నలిస్ట్ మిడిసినమెట్ల సతీష్**



**క్రైమ్ మిర్రర్, నేరేడుచర్ల:** మహానీయుల స్ఫూర్తితో యువత సమాజ సేవలో ముందుకు రావాలని ఆర్టీఐ కార్యకర్త, జర్నలిస్ట్ మిడిసినమెట్ల సతీష్ అన్నారు. కోదాడ లో శనిగల రాధాకృష్ణ అమ్మానాన్న అనాధ ఆశ్రమం లో ఆదివారం సామాజిక కార్యకర్త ఆర్టీఐ నేరేడుచర్ల మండలం అధ్యక్షులు మిడిసినమెట్ల సతీష్, సోదరుడు వేణు తో కలిసి అనాధ పిల్లలకు, పెద్దలు కు తన వంతు సహకారం తో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ యువత మానవసేవే మాధవసేవ అనే దృక్పధంతో తమ వంతు సహాయం చేయాలని అన్నారు. ప్రభుత్వం ఉచిత వైద్యం పేదలకు అందించాలన్నారు. యువత సామాజిక సేవలల్లో పాల్గొనాలని, పుట్టినరోజు కార్యక్రమాలు,వివిధ కార్యక్రమాలు అనాధ ఆశ్రమాలలో చేసుకుంటే పేదలకు సహాయం చేసినవారమవుతామ్మన్నారు. యువత ఈ రోజుల్లో చెడు వ్యసనాలకు దుష్ట ఆలోచన నేరాలు డ్రగ్స్ బానిస అవుతున్నారని యువత సమాజసేవ కార్యక్రమాలవైపు మరలాలని కోరారు. అనాధ ఆశ్రమాలకు ప్రభుత్వం సహకారంతో అభివృద్ధి చేసి వారికి సరైన సౌకర్యాలు కల్పించాలని కోరారు.ఇలాంటి కార్యక్రమాలకి ముందుకు వచ్చి ఎవరైనా ఆశ్రమంలోని దివ్యాంగులకు వృద్ధులకు ఒంటరి మహిళలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తే బాగుంటుందన్నారు. అన్నదాన కార్యక్రమం చేసిన మిడిసినమెట్ల బ్రదర్ కు దేవుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆశ్రమం తరపున అందరూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# చేవెళ్ల ఎమ్మెల్యే తనయుడు కాలే చందుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన శంకర్ పల్లి కాంగ్రెస్ నాయకులు

**క్రైమ్ మిర్రర్ శంకర్‌పల్లి:** ఎమ్మెల్యే కాలే యాదయ్య తనయుడు, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాలే చందు జన్మదినం సందర్భంగా శంకర్‌పల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లారం ప్రశాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘునందన్ రెడ్డి, శ్రీకాంత్ ముదిరాజ్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాలే చందుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# పుస్తక పఠనమే విద్యార్థుల జ్ఞానం, జ్ఞాపకశక్తి వికాసానికి దోహదం

**-హైదరాబాద్ ప్రాంతీయ విద్యా సంచాలకులు ఎం. సోమిరెడ్డి**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** విద్యార్థులు తమ పాఠ్యపుస్తకాలతో పాటు కథలు, సాహిత్యం, చరిత్ర, విజ్ఞానం తదితర అంశాలకు సంబంధించిన పుస్తకాలను విస్తృతంగా చదవడం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు సృజనాత్మక ఆలోచనా శక్తి, ఊహాశక్తి, జ్ఞాపకశక్తిని అభివృద్ధి చేసుకోవచ్చని హైదరాబాద్ ప్రాంతీయ విద్యా సంచాలకులు (ఆర్జేడీ) ఎం. సోమిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన కొల్లాపూర్ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అవసరాల కోసం తన సొంత నిధుల నుంచి రూ.50 వేల విలువైన సామగ్రిని అందజేశారు. ఇందులో రూ.40 వేల విలువైన రోటి మేకింగ్ మిషన్‌తో పాటు రూ.10 వేల విలువైన తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషలకు సంబంధించిన కథలు, సాహిత్యం, చరిత్ర, పెద్దబాల శిక్ష తదితర అంశాలతో కూడిన సుమారు 100 రకాల పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆర్జేడీ సోమిరెడ్డి పుస్తక పఠన కార్యక్రమంలో పాల్గొన్నారు. పుస్తకాలను కేవలం చదవడం మాత్రమే కాకుండా, అందులోని విషయాలను అర్థం చేసుకుని, వాటి ద్వారా కొత్త విషయాలను తెలుసుకునే విధంగా పఠన అలవాటును పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా ఆర్జెడి సోమిరెడ్డి మాట్లాడుతూ.... పుస్తకాలు విద్యార్థుల జ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు భాషా నైపుణ్యాలు, ఆలోచనా విధానం, ఊహాశక్తి, సృజనాత్మకతను అభివృద్ధి చేస్తాయని తెలిపారు. ప్రతిరోజూ కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించడం ద్వారా విద్యార్థులు తమ వ్యక్తిత్వాన్ని మరింతగా తీర్చిదిద్దుకోవచ్చని అన్నారు. వివిధ భాషలు, సాహిత్యం, చరిత్ర, విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలను చదివి విస్తృత పరిజ్ఞానాన్ని సంపాదించుకోవాలని సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన పుస్తకాలు, ఇతర సదుపాయాలను పాఠశాలల్లో అందుబాటులోకి తీసుకురావడంతో పాటు పఠన సంస్కృతిని ఉపాధ్యాయులు మరింతగా ప్రోత్సహించాలని ఆర్జేడీ సూచించారు. కేజీబీవీలలో రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా, వసతి సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం కొల్లాపూర్ పట్టణంలోని ప్రాథమిక పాఠశాలను ఆర్జేడీ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే బలమైన విద్యా పునాది ఏర్పడేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని ప్రతి పాఠశాలలో సమర్థవంతంగా అమలు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి జ్యోతి మాట్లాడుతూ కేజీబీవీ విద్యార్థుల కోసం తన సొంత నిధులతో రూ.40 వేల విలువైన రోటి మేకింగ్ మిషన్‌తో పాటు రూ.10 వేల విలువైన పుస్తకాలను అందజేసిన ఆర్జేడీ ఎం. సోమిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వివిధ కేజీబీవీలలో విద్యార్థుల అవసరాల కోసం దాతల సహకారంతో సుమారు రూ.30 లక్షల విలువైన వివిధ రకాల సదుపాయాలు, సామగ్రిని అందించడం అభినందనీయమని ఆమె తెలిపారు. అనంతరం ఆర్జేడీ ఎం. సోమిరెడ్డిని శాలువాతో సత్కరించి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ మండల విద్యాధికారి, కేజీబీవీ ప్రత్యేక అధికారి నారాయణమ్మ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రక్తాన్ని తయారు చేయలేం.. దానంతోనే ప్రాణదానం!

**అక్టోబరు 1న జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం**

**అవగాహన కరపత్రాలు ఆవిష్కరించిన డీఎంహెచ్‌వో నరేంద్ర రాథోడ్**

**మంచిర్యాల సెప్టెంబర్ 30 (క్రైమ్ మిర్రర్):** సమయానికి రక్తం అందక ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకూడదనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేంద్ర రాథోడ్ పిలుపునిచ్చారు. అక్టోబరు 1న జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం సందర్భంగా చేపడుతున్న 'రక్త సహాయ ఉద్యమం' అవగాహన కరపత్రాలను సోమవారం తన కార్యాలయంలో లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ రక్తదానంపై ఉన్న అపోహలను వీడాలని సూచించారు. రక్తదానం సురక్షితమైన ప్రక్రియ అని, రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేమని తెలిపారు. దాతలు ఇచ్చే రక్తమే అవసరమైన వారికి ప్రాణాధారమన్నారు. ఒక యూనిట్ రక్తంతో ముగ్గురు బాధితులకు ఉపయోగపడేలా రక్త భాగాలను అందించవచ్చని వివరించారు. 18 నుంచి 60 ఏళ్ల వయస్సు, కనీసం 45 కిలోల బరువున్న ఆరోగ్యవంతులు రక్తదానం చేయవచ్చున్నారు. సేకరించిన రక్తాన్ని వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి అందిస్తామని తెలిపారు. రోడ్డు ప్రమాద బాధితులు, శస్త్రచికిత్సలు చేయించుకునేవారు, ప్రసవ సమయంలో గర్భిణులు, రక్తహీనత, క్యాన్సర్, సికిల్‌సెల్, తలసీమియా బాధితులకు రక్తం అవసరమవుతుందని వివరించారు.

### రక్తదాన శిబిరం

అక్టోబరు 1న జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, లైన్స్ క్లబ్‌లు, ఎన్జీవోలు, ఎన్‌సీసీ కేడెట్లు, యువత పెద్దఎత్తున పాల్గొని రక్తదాన ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో కాకిరాల వెంకటేశ్వర్లు, డైరెక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, లైన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.






# వెల్దండలో అక్రమ మద్యం తయారీపై సంయుక్త దాడులు

**1,450 లీటర్ల ఎఫ్‌జే వాష్ ధ్వంసం..**

**10 లీటర్ల ఐడీ లిక్కర్, 480 కిలోల నల్లబెల్లం స్వాధీనం**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (వెల్దండ):** అక్రమ మద్యం తయారీ, నిల్వ, విక్రయాలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు ఉక్కుపాదం మోపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్‌టీఎఫ్ హైదరాబాద్, ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ మహబూబ్‌నగర్, డీటీఎఫ్ నాగర్‌కర్నూల్, కల్వకుర్తి పోలీస్ స్టేషన్ బృందాలు బుధవారం వెల్దండ మండలంలోని పోచమ్మగడ్డ తండా, సిలోనిబావి తండా ప్రాంతాల్లో సంయుక్తంగా దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో అక్రమంగా తయారు చేస్తున్న 1,450 లీటర్ల ఎఫ్‌జే వాష్‌ను ధ్వంసం చేయగా, 10 లీటర్ల ఐడీ లిక్కర్, 480 కిలోల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని అరెస్టు చేసి, మొత్తం ఆరు కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. దాడుల్లో డీటీఎఫ్ సీఐ నాగార్జున రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ తిరుపతి రెడ్డి, ఎస్‌టీఎఫ్ సీఐ వెంకటేశ్వర్లు, కల్వకుర్తి ఎస్‌హెచ్‌ఓ కె. రవిచంద్ర రెడ్డి, ఎస్ఐ చాంద్‌బీ షేక్‌తో పాటు ఎక్సైజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అక్రమ మద్యం తయారీ, రవాణా, నిల్వ, విక్రయాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. అక్రమ మద్యం నిర్మూలనలో భాగంగా తనిఖీలు, దాడులు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు.

# స్వచ్ఛతా హి సేవా 2026...

**సఫాయి మిత్రులకు సీఎంసీ సత్కారం....**

**క్రైమ్ మిర్రర్ సైబరాబాద్:** స్వచ్ఛతా హి సేవా 2026లో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ఆధ్వర్యంలో సఫాయి మిత్ర సురక్షా మరియు సమ్మాన్ శిబిరాలను నిర్వహించారు. సీఎంసీ ప్రధాన కార్యాలయంలో పారిశుధ్య కార్మికులను కమిషనర్ ఘనంగా సత్కరించారు. నగర పరిశుభ్రతలో వారి సేవలను అభినందించారు. ఈ శిబిరాల్లో కార్మికులు, వారి కుటుంబాలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు, (పీఎమ్ఎవై) , ఆయుష్మాన్ భారత్, జీవన్ జ్యోతి బీమా వంటి పథకాల్లో నమోదు, పీ పి ఈ కిట్ల పంపిణీ చేశారు.




# ఖమ్మం కార్పొరేషన్‌లో పౌర సేవలు కుంటుపడ్డాయి

**వీధిలైట్లు, పారిశుధ్య సమస్యలను తక్షణమే పరిష్కరించాలి: బీఆర్ఎస్ నగర నాయకులు**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాల్లో నెలల తరబడి వీధిలైట్లు వెలగకపోవడం, పారిశుధ్య సమస్యలు పేరుకుపోవడం, పౌర సేవలు సక్రమంగా అందకపోవడంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఈరోజు ఖమ్మం మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రధానంగా నగరంలోని పలు డివిజన్లలో మూడు, నాలుగు నెలలుగా వీధిలైట్లు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పాడైన లైట్లకు మరమ్మతులు చేయడం లేదా కొత్త లైట్లు ఏర్పాటు చేయడం లేదని నాయకులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేక చెత్త, మురుగు పేరుకుపోవడంతో దోమల బెడద పెరిగి ప్రజలు అనారోగ్య సమస్యలతో ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. వర్షాకాలంలో ముందస్తు పారిశుధ్య చర్యలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ అధికారులు తగిన స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్థానిక మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు పరిమితమవుతున్నారనే విమర్శలు ప్రజల్లో ఉన్నాయని, అయితే క్షేత్రస్థాయిలో పౌర సమస్యల పరిష్కారంపై మరింత దృష్టి అవసరమని అన్నారు. గతంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మంత్రిగా ఉన్న సమయంలో తెల్లవారుజామునే కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ తదితర అధికారులను వెంటబెట్టుకుని నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ పారిశుధ్య పరిస్థితులను పరిశీలించి, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని అధికారులను అప్రమత్తం చేసేవారని బీఆర్ఎస్ నాయకులు గుర్తుచేశారు. ప్రస్తుతం వీధిలైట్లు, పారిశుధ్యం, పౌర సేవలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తక్షణమే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక పౌర సేవలను మెరుగుపరచడంలో నిర్లక్ష్యం కొనసాగితే, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల తరఫున పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని



# మాదాపూర్ లో సర్వీస్ అపార్ట్‌మెంట్ల పై పోలీసుల నిఘా

**రెండు రోజుల్లో రెండు కేసులు నమోదు....**

**క్రైమ్ మిర్రర్ మాదాపూర్:** నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న సర్వీస్ అపార్ట్‌మెంట్లపై మాదాపూర్ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. గత రెండు మూడు రోజుల్లో నిర్వహించిన తనిఖీల్లో రెండు కేసులు నమోదు చేసినట్లు మాదాపూర్ ఎస్‌హెచ్‌ఓ కే.వి. సుబ్బారావు తెలిపారు. సర్వీస్ అపార్ట్‌మెంట్ల పేరుతో కొన్ని అపార్ట్‌మెంట్లను అద్దెకు తీసుకుని బర్త్‌డే పార్టీల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో గ్యాంబ్లింగ్‌కు సంబంధించిన రెండు కేసులు, వ్యభిచారానికి సంబంధించిన ఒక కేసు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. అపార్ట్‌మెంట్ యజమానులు అద్దెకు ఇచ్చే సమయంలో అద్దెదారుల పూర్తి వివరాలు, గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. ఎవరు వస్తున్నారు, ఎంతమంది వస్తున్నారు, ఏ అవసరంతో అపార్ట్‌మెంట్ తీసుకుంటున్నారనే వివరాలను తెలుసుకోవాలని పేర్కొన్నారు.




నిబంధనలు పాటించని సర్వీస్ అపార్ట్‌మెంట్ నిర్వాహకులు, యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మాదాపూర్ ఎస్‌హెచ్‌ఓ కే.వి సుబ్బారావు హెచ్చరించారు. అవసరమైతే రెవెన్యూ అధికారులకు సమాచారం అందించి సంబంధిత అపార్ట్‌మెంట్లను సీజ్ చేయించే చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

# గణేష్ నిమజ్జనంలో కత్తులతో దాడి.. ఎనిమిది మంది అరెస్ట్

**హత్యాయత్నం, ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు..**

**రిమాండ్‌కు తరలింపు**

**క్రైమ్ మిర్రర్, మాడ్గులపల్లి ప్రతినిధి:** నల్గొండ జిల్లా, మాడ్గులపల్లి మండలంలోని కుక్కడం గ్రామంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా జరిగిన దాడి ఘటనలో ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 22, 2026 రాత్రి కుక్కడం గ్రామంలో గణేష్ నిమజ్జనం కార్యక్రమం జరుగుతున్న సమయంలో పోతేపాక సాయి కుమార్‌పై కత్తులతో కొందరు దాడికి పాల్పడి హత్యాయత్నం చేసినట్లు ఫిర్యాదు అందింది.ఈ ఘటనకు సంబంధించి కుక్కడం గ్రామానికి చెందిన తండు వరుణ్, తండు వేణు, తండు వెంకన్న, తండు లింగయ్య, అనుముల వేణు, అనుముల మహేష్, అనుముల నాగరాజు, మొలకపట్నం హేమంత్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనపై హత్యాయత్నం, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో నిందితులను మిర్యాలగూడ ఇ/ఛ డీఎస్పీ జి. రవి ఆధ్వర్యంలో పోలీసులు అరెస్ట్ చేసి, అనంతరం న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.



# చలో ఢిల్లీని జయప్రదం చేయండి

### విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలి: డీవైఎఫ్ఐ

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 30:** విద్యార్థులు, యువత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 2న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య అఖిలభారత కమిటీ పిలుపులో భాగంగా జిల్లా నాయకులు ఢిల్లీకి బయలుదేరారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, బాబురావు మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి శాశ్వత ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి యువతను మోసం చేశారని వారు ఆరోపించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలో కొనసాగించాలని, ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 200 రోజుల పని కల్పించాలని కోరారు. పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని, కార్మికులకు నష్టం కలిగించే




కార్మిక చట్టాలను రద్దు చేసి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ప్రశాంత్, నాయకులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.




# మక్త పెద్దకుడి చెరువు వద్ద బతుకమ్మకు ఏర్పాట్లు చేయాలి....

### బీజేపీ నేత గుండె గణేష్ వినతి.....

**క్రైమ్ మిర్రర్ మియాపూర్:** మక్త పెద్దకుడి చెరువు వద్ద బతుకమ్మ పండుగకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని బీజేపీ రంగారెడ్డి డిస్ట్రిక్ట్ కౌన్సిల్ మెంబర్ గుండె గణేష్ ముదిరాజ్ సీఎంసీ అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన మియాపూర్ సర్కిల్-48 డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు. చెరువు సుందరీకరణ పనులు పూర్తి కానందున, పండుగకు తాత్కాలికంగా పరిశుభ్రత, లైటింగ్, తాగునీరు, మహిళలకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు జాజెరావు శ్రీనివాస్, కొంచ యాదయ్య, దర్గా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌సియు లో వామపక్షాల విజయం

### మతోన్మాదం, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యార్థుల తీర్పు

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 30:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ఎన్నికల్లో వామపక్ష కూటమి విజయం సాధించడం విద్యార్థుల స్పష్టమైన తీర్పుకు నిదర్శనమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అర్జున్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యా సంస్కరణలు, విద్యా కాషాయీకరణ, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు తమ నిర్ణయాన్ని వెల్లడించారని పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ వద్ద హెచ్‌సీయూ విద్యార్థి సంఘాల ఎన్నికల్లో వామపక్షల విజయాన్ని పురస్కరించుకుని విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ హెచ్‌సీయూలో వామపక్ష కూటమి తరఫున అధ్యక్ష అభ్యర్థిగా పోటీ చేసిన ఎస్ఎఫ్ఐ నాయకురాలు దిలీషా, ఏబీవీపీ అభ్యర్థిపై 450 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారని తెలిపారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఎస్ఎఫ్ఐకు ఈ విజయం గుర్తింపు అని అన్నారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో మాదిరిగానే రాష్ట్ర, ప్రాంతీయ విశ్వవిద్యాలయాల్లోనూ విద్యార్థి



సంఘాల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి దశ నుంచే రాజకీయ, సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవడానికి ఎన్నికలు దోహదపడతాయని పేర్కొన్నారు. హెచ్‌సీయూ విజయం స్ఫూర్తిగా జిల్లాలో విద్యార్థుల సమస్యలపై మరింత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, సహాయ కార్యదర్శి శాంసన్, జిల్లా కమిటీ సభ్యుడు కృపాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటాం



**క్రైమ్ మిర్రర్,మంగపేట:** ఆపదలో ఉన్న ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు అన్నారు.మండలంలోని బోర్ నర్సాపూర్ గ్రామానికి చెందిన కర్రి తిరుమల అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు బుధవారం మృతురాలి గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించి ధైర్యం చెప్పారు. అనంతరం దశదినకర్మలకు ఖర్చుల నిమిత్తం రూ.5,000 నగదుతో పాటు 50 కిలోల బియ్యాన్ని ఆర్థిక సాయంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు చాదా మల్లయ్య , ములుగు ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరస్వామి. ములుగు జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మూగల చంటి. మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బిల్లాటి నరేష్. మల్లూరు హేమాచల లక్ష్మి నరసింహస్వామి ఆలయ డైరెక్టర్ బోడ బుర్రయ్య మండల మీడియా ఇంచార్జ్ బాసారి కాని నాగార్జున యూత్ కాంగ్రెస్ మండల మీడియా కోఆర్డినేటర్ భూక్య కుమార్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వర్కింగ్ జర్నలిస్టులకు క్యాష్ లెస్ ఉచిత వైద్య సేవలు అందించాలని పోస్ట్ కార్డుల ఉద్యమం

### గాలేశిక గురుపాదం

**క్రైమ్ మిర్రర్,నాంపల్లి:** జర్నలిస్టుల ఆరోగ్య భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఉదాసీన వైఖరికి నిరసనగా ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చే విధముగా దశల వారి ఉద్యమం చేపట్టాలని టి యు డబ్ల్యు జే - 143 రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని నల్లగొండ జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గాలెంక గురుపాదం పేర్కొన్నారు. వర్కింగ్ జర్నలిస్టులందరికీ క్యాష్ లెస్ హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం పై తెచ్చినప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు.టి యు డబ్ల్యు జే రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అక్టోబర్ 2, గాంధీ జయంతి సందర్భంగా అన్ని జిల్లా కేంద్రాల నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం ( సి ఎం ఓ )కు 50 పైసల విలువ చేసే పోస్ట్ కార్డుల ఉద్యమాన్ని ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు.అక్టోబర్ 2 నుండి 8వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులంతా 50 పైసల పోస్ట్ కార్డు పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి పోస్ట్ కార్డులు రాసి పోస్ట్ ఆఫీస్ ల ద్వారా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం, డాక్టర్



బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం, హైదరాబాద్-500022 కు పోస్ట్ కార్డులను పంపించాలని జర్నలిస్టులకు విజ్ఞప్తి చేశారు.జర్నలిస్టులకు ఈ హెచ్ ఎస్ కాకుండా ఈ జె హెచ్ ఎస్ స్కీంను పునరుద్ధరించి మెరుగైన సేవలు అందించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సీనియర్ జర్నలిస్ట్ గాలేశిక వినోద్ కుమార్, కామిశెట్టి యాదయ్య, గెంటేల వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.